
RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 236 | పేజీలు : 08 | శనివారం | 05-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



## మాకు సంబంధం లేదు

- ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు కొండా సురేఖ స్పష్టీకరణ
- తన పేరుతో సర్క్యులేట్ అవుతున్న పోస్టులను ఖండించిన కొండా సురేఖ
- క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి సురేఖకు ఉద్వాసన
- కుమార్తె వ్యాఖ్యలపై ఇచ్చిన షోకాజ్ నోటీసుతో మొదలైన వివాదం
- అధిష్ఠానాన్ని బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని రేవంత్ రెడ్డిపై ఆరోపణ
- కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్

## నిర్మాణాల నాణ్యతలో.. రాజీపడొద్దు

- కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం
- నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దని ఆదేశం
- కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- మద్దూరులో, హకీంపేట, దౌల్తాబాద్‌లలో అభివృద్ధి పనుల పరిశీలన
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని సూచించిన సీఎం







హైదరాబాద్ పల్స్,డెస్క్

కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం**

అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు



## దమ్ముంటే నాపై పోటీ చేయాలి

- దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి: కవిత
- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత
- తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి
- బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ

హైదరాబాద్ పల్స్,డెస్క్


తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె

## రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు..

**రైతుల జీవితాలతో రేవంత్ రెడ్డి ఆడుకుంటున్నారు:హరీశ్‌రావు ధ్వజం**

హైదరాబాద్ పల్స్,డెస్క్

రైతుల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆడుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం కొమురం భీం జిల్లాలోని కౌటాల రైతు సదస్సులో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. సిర్పూర్ నియోజకవర్గంలో





## సన్నబియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తాం

హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రజలు సన్నబియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుడిసెలో ఉండే ప్రతి ఒక్కరికీ ఇప్పుడే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని.. ఇందుకు పార్టీతో పని లేదని.. పేదవారైతే అర్హుడే అని స్పష్టం చేశారు. ఇళ్లు లేని వారికి

## సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు..

- తెలంగాణలో కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు ఉపశమనం
- ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం
- వెరిఫికేషన్ సమయంలో మాత్రం సర్టిఫికెట్లు తప్పనిసరి
- సర్టిఫికెట్ల జాప్యంతో అర్హులకు ఇబ్బందులు
- దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఊరట
- కొత్త పింఛన్లకు సెప్టెంబర్ 15 చివరి తేదీ




హైదరాబాద్ పల్స్,డెస్క్

కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా.. వాటి కోసం ఎదురుచూడాల్సిన

## కేసీఆర్ చాలా మంచోడు

**కొండా సురేఖ ప్రశంసలు**

- వార్తా ఛానళ్లకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్న కొండా సురేఖ
- కేసీఆర్ తమను హుందాగా రిసీవ్ చేసుకునేవారని వెల్లడి
- కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్న సురేఖ



హైదరాబాద్ పల్స్,డెస్క్

మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు.



## మాటతీరు మార్చుకోవాలి

**కొండా సురేఖ మాటతీరు మార్చుకోవాలి : టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**

హైదరాబాద్ పల్స్,డెస్క్

మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించిన అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..

## కాంగ్రెస్‌లో ఎక్కడా వర్గ పోరు లేదు

**మంత్రి వివేక్ వెంకటస్వామి**



## తప్పుడు ప్రచారం: జగన్

- అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం: జగన్
- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్



## దమ్ముంటే నాపై పోటీ చేయాలి

మొదటి పేజీ రువాయి

తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత... వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సంకేతాలిచ్చారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

## కేసీఆర్ చాలా మంచోడు

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

## కాంగ్రెస్‌లో ఎక్కడా వర్గ పోరు లేదు

మంత్రి వివేక్ వెంకటస్వామి

మొదటి పేజీ రువాయి

ఎక్కడా వర్గ పోరు లేదని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. నేతలు అందరం కాంగ్రెస్ బలోపేతం కోసమే పని చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వేయి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేసిందని తెలిపారు.

**ఆ జీవోను పున:పరిశీలన చేస్తున్నాం..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేక పోయిన తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. 22ఏ భూముల సమస్య గత బీఆర్ఎస్ ప్రభుత్వ పుణ్యమేనని, ఆ జీవోను పున:పరిశీలన చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే పరిష్కరిస్తామని మాటిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ఎందుకు కుగిందనే విషయంపై హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు.

## సన్నబియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తాం

మొదటి పేజీ రువాయి

ఇళ్లు ఇవ్వకపోతే సర్పంచ్ పదవి పోతుందని చెప్పుకొచ్చారు. రఘునాథపాలెం మండలం పుటాని తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏపీవో రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు.

**పోడు భూముల సమస్య పరిష్కరిస్తా..**

పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల మాటిచ్చారు. కేవలం వ్యవసాయం మీదనే బతికే కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ ఏడాది వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని... వేసిన పంటలు పండే ఛాన్స్ లేదని తెలిపారు. తీవ్రమైన కరువు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని అన్నారు. నీళ్లు లేకపోయినా బతికే పంట ఫామ్ ఆయిల్ అని చెప్పారు. పామాయిల్ పంట వేస్తే అన్నీ ఉచితంగా ఇస్తామని స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలానికి ఈ రాత్రికి నీళ్లు వదులుతున్నామని, రేపు మోటార్లు ఆన్ చేసుకోవాలని అన్నారు. ఆర్‌వీఎఫ్‌ఆర్ పట్టా ఉన్న వారికి బోర్ అనుమతి ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు.

**స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పాఠశాల కూడా రాబోతుంది..**

రూ.75 కోట్లతో 200 డొంక రోడ్లన్నీ వేయిస్తానని, దీంతో పాటు పొలాలకు వెళ్లేందుకు ఉన్న రోడ్లు కూడా వేయిస్తానని మంత్రి తుమ్మల తెలిపారు. పిల్లల చదువు కోసం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పాఠశాల కూడా రాబోతుందని వెల్లడించారు. పిల్లలకు చదువు లేకపోతే బతుకులు మారవని అభిప్రాయపడ్డారు. వందల కోట్లు పెట్టి పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తుంటే.. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు..

మొదటి పేజీ రువాయి

అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫికెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడుతుండటంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది.

**వెరిఫికేషన్‌లో మాత్రం తప్పనిసరి**

దరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**సెప్టెంబర్ 15 వరకు అవకాశం**

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అర్హత ఉన్న వారు ఇంకా దరఖాస్తు చేయకపోతే ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు అప్లై చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు..

మొదటి పేజీ రువాయి

42వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి పేదల ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహించారు. నాడు కేసీఆర్ భూములిస్తే... రేవంత్‌రెడ్డి ఆ భూములు లాక్కుంటున్నారని దుయ్యబట్టారు. నిషేధిత జాబితాలోని రైతన్నలకు ఎలాంటి పథకాలు వర్తించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజలే కేంద్ర బిందువుగా కేసీఆర్ పాలన..**

'ప్రజలే కేంద్ర బిందువుగా కేసీఆర్ పాలన చేశారని.. భూములే కేంద్ర బిందువుగా రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోంది. లక్షలాది ఎకరాలు, ఇల్లు, ప్లాట్లను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. సూర్యుడు చుట్టూ భూమి తిరుగుతుంటే... భూముల చుట్టూ రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలివ్వాలే కానీ ఉన్న భూములను కబ్జా పెడుతోంది. ఈ ప్రభుత్వమే ప్రజల భూములను కబ్జా పెట్టింది. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని కబ్జాదారులను అవమానిస్తున్నారు. ఒక్క ఎకరం కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అంటున్నారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి చెబితే కలెక్టర్లు నిషేధిత భూముల జాబితా పంపించారని... అప్పుడెమో పొంగులేటి సారీ అని ఈజీగా చెబుతున్నారు. ప్రజల బాధను ఆయన చూసి మాట్లాడాలి' అని హరీశ్‌రావు హితవు పలికారు.


**ప్రజల నోటి కాడి బువ్వ లాక్కోవడమేనా ఇందిరమ్మ రాజ్యం..**

'15లక్షల ఎకరాల భూములను 22ఏ లో పెట్టి సారీ అని చెప్పి తప్పించుకోలేరు. ప్రజల నోటి కాడి బువ్వ లాక్కోవడమేనా ఇందిరమ్మ రాజ్యం. కలెక్టర్లు, అధికారులు, ప్రజలను ఇబ్బంది పెడితే.. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఎవరిని వదిలిపెట్టం. బేషరతుగా నిషేధిత జాబితాలోని భూములను పట్టా భూములుగా మార్చాలి. ప్రజలకు, రైతులకు న్యాయం జరిగే వరకు ఊరుకునేది లేదు. రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు కూడా టెండర్ వేయట్లేదు. రేవంత్‌రెడ్డికి 15 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు టెండర్ వేయడం లేదు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భార్య కూడా 15శాతం కమీషన్ అడుగుతుంది. అందుకే టెండర్ వేయడానికి ఒక్కరూ కూడా ముందుకు రావట్లేదు. వెయ్యి రోజుల పాలనలో ఏ ఒక్క పని కూడా సరిగ్గా చేయలేదు' అని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మాటతీరు మార్చుకోవాలి

మొదటి పేజీ రువాయి

కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని అభిప్రాయపడ్డారు. సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. కొండా సురేఖ మాటతీరు మార్చుకోవాలని హితవుపలికారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే సురేఖపై చర్యలు తీసుకున్నట్లు మహేశ్ వివరించారు. క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే హైకమాండ్ చర్యలు తీసుకుందని వెల్లడించారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మాట్లాడేందుకు పార్టీలో ఎన్నో వేదికలు ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. భవిష్యత్తులోనూ బీసీలకు పెద్దపీట వేస్తామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.



## మాకు సంబంధం లేదు

మొదటి పేజీ రువాయి

అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

## తప్పుడు ప్రచారం: జగన్

మొదటి పేజీ రువాయి

ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్‌ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

## నిర్మాణాల నాణ్యతలో.. రాజీపడొద్దు

మొదటి పేజీ రువాయి

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.


హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ఆరా

దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అధికారులకు దిశానిర్దేశం430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలి: ఆకుల సతీష్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** వినాయక చవితి సందర్భంగా నిర్వహించే 11 రోజుల గణేష్ ఉత్సవాలు హిందువుల ఐక్యత, సామరస్యానికి ప్రతీకలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ అన్నారు.రాబోయే వినాయక చవితి ఉత్సవాలను కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలో ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో చింతల్‌లోని జై కన్వెన్షన్ బ్యాంక్వెట్ హాల్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డివిజన్ కమిటీల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సమితి సెంట్రల్ కమిటీ సెక్రటరీ రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ, గత 49 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలో దేవాలయాలు, వినాయక మండపాల నిర్వాహకులు, వివిధ హిందూ సంఘాలు, కాలనీల పెద్దలతో సమన్వయం చేసుకుని హిందూ సమాజాన్ని మరింత సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని డివిజన్లలో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి హిందూ ఐక్యతను చాటాలని సూచించారు.అనంతరం ఆకుల సతీష్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా మండప నిర్వాహకులు, అధికారులు మరియు వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ గణేష్ ఉత్సవాలు ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ పరిధిలో 8 మంది కో-కన్వీనర్లు, 11 మంది డివిజన్ కన్వీనర్లు, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు 9 నిమజ్జన కేంద్రాల వద్ద ప్రత్యేక బాధ్యులను నియమించి అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని చెప్పారు.రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లన్నీ ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటు, విద్యుత్ మరియు పోలీసు అనుమతుల విషయంలో నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్లు జై శంకర్, కట్ట కుమార్, పులి బలరాం, గరిగే శేఖర్, అరుణ్ రావు, మల్లారెడ్డి, మహిళా ఇన్‌చార్జ్ సుహాసిని శక్తి, లీగల్ ఇన్‌చార్జ్ శివానంద్, కో-ఇన్‌చార్జ్ కోడి ఆదిత్య, డివిజన్ కన్వీనర్లు పోలబోయిన శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సతీష్ సాగర్, నాగరాజు, విఘ్నేష్ ముదిరాజు, రామ్ సాయి యాదవ్, శంకర్, పరుశు వేణు, మాధవులు, శరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ప్రారంభించిన సర్పంచ్‌లు జైపాల్ నాయక్, కవిత-సేనాపతి

**చౌటకూర్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** విద్యార్థులు, ఉద్యోగులు మరియు ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేందుకు చౌటకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెం గ్రామానికి నూతన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బొమ్మరెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్, హన్యా నాయక్ తండా సర్పంచ్ కవిత-సేనాపతిలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ బస్సును అధికారికంగా ప్రారంభించారు. గ్రామస్తుల అవసరాల నిమిత్తం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేయగా, తక్షణమే స్పందించి బస్సు సౌకర్యం కల్పించిన ఆర్ఎం, డీఎంలకు ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.ఈ బస్సు జోగిపేట నుండి వయా లక్ష్మీసాగర్, బొమ్మరెడ్డిగూడెం మీదుగా సంగారెడ్డికి, అలాగే తిరుగు ప్రయాణంలో



సంగారెడ్డి నుండి వయా చౌటకూర్, బొమ్మరెడ్డిగూడెం, లక్ష్మీసాగర్ మీదుగా జోగిపేటకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సౌకర్యం ద్వారా బొమ్మరెడ్డిగూడెం, హన్యా నాయక్ తండా, సంగ్య నాయక్ తండా, తావుర్య తండా, విట్టల్ నాయక్ తండా, లాల్ సింగ్ నాయక్ తండా, లక్ష్మీసాగర్, ఉమ్లా తండా, కొండారెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరనుంది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజనీ గోపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు, విశ్రాంత వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గోవిందరావు, ఎక్సైజ్ గోపాల్, మాజీ సర్పంచ్ మమతా రఘునాయక్, వార్డు సభ్యులు సుభాష్, నీలాబాయి, పలువురు నాయకులు, జీవవైవిధ్య కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** హైదరాబాద్ నగర తొలి మేయర్, బహుముఖ ప్రజ్ఞాశాలి కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పికెట్‌లోని జూబ్లీ బస్ స్టేషన్ వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఆయన విగ్రహానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి తొలి మేయర్‌గా మాస్టర్ ప్లాన్ రూపొందించి, అమలు చేయడంలో కొరివి కృష్ణస్వామి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడిగా, రచయితగా, విద్యావేత్తగా సేవలు అందించడమే కాకుండా, 'డెక్కన్ స్టార్' పత్రిక ద్వారా హైదరాబాద్‌లో ఆధునిక ముద్రణ విధానాన్ని ప్రవేశపెట్టిన గొప్ప పాత్రికేయుడని స్మరించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పిట్ల నాగేష్, చొప్పరి శంకర్, కోట్ల పుష్పలత, సత్యం, రాజేందర్, సురేష్, నవీన్, ప్రవీణ్ తదితర నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మనిషిలో పంది కిడ్నీ.. 271 రోజులు పనిచేసిన అరుదైన ప్రయోగం

**అమెరికా, సెప్టెంబర్ 04, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** అవయవ మార్పిడి వైద్య రంగంలో శాస్త్రవేత్తలు మరో కీలక ముందడుగు వేశారు. జన్యుమార్పిడి చేసిన పంది మూత్రపిండాన్ని మనిషికి అమర్చి 271 రోజుల పాటు విజయవంతంగా పనిచేయించినట్లు అమెరికాలోని మాస్ జనరల్ బ్రిగమ్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. అవయవ దాతల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులకు ఈ ప్రయోగం కొత్త ఆశలు కలిగిస్తోంది.

**ఏడేళ్ల నిరీక్షణకు బదులుగా ప్రయోగానికి అంగీకారం**

టైప్-2 మధుమేహం కారణంగా మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్న 66 ఏళ్ల టిమ్ ఆండ్రూస్‌కు ఈ ప్రయోగాత్మక శస్త్రచికిత్స నిర్వహించినట్లు సమాచారం. మానవ మూత్రపిండం కోసం ఆయన సుమారు ఏడేళ్లు వేచి ఉండాల్సి వస్తుందని వైద్యులు అంచనా వేశారు. దీంతో డయాలసిస్‌పై ఆధారపడకుండా ఉండేందుకు ఆయన ప్రయోగాత్మక అవయవ మార్పిడికి అంగీకరించారు.

**69 జన్యుమార్పులతో పంది కిడ్నీ**

సాధారణ పంది మూత్రపిండాన్ని మనిషికి అమర్చినప్పుడు రోగనిరోధక వ్యవస్థ దాన్ని విదేశీ అవయవంగా గుర్తించి తీవ్రంగా తిరస్కరించే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను తగ్గించేందుకు యుకాటాన్ రకానికి చెందిన పందిలో 69 జన్యు మార్పులు చేసినట్లు వైద్యులు తెలిపారు.పంది కణాల్లోని కొన్ని వైరస్ సంబంధిత జన్యు అంశాలను తొలగించడంతో పాటు, మానవ రోగనిరోధక వ్యవస్థ అవయవాన్ని సులభంగా తిరస్కరించకుండా ఉండేందుకు అవసరమైన జన్యు మార్పులు చేశారు.



**271 రోజుల పాటు కిడ్నీ పనితీరు**

2025 జనవరి 25న నిర్వహించిన శస్త్రచికిత్స అనంతరం పంది మూత్రపిండం రోగి శరీరంలో వెంటనే పనిచేయడం ప్రారంభించినట్లు సమాచారం. మొత్తం 271 రోజుల పాటు అది మూత్రపిండం విధులను నిర్వహించింది.తర్వాత రోగనిరోధక వ్యవస్థకు సంబంధించిన ప్రతికూల ప్రభావాల కారణంగా మూత్రపిండం పనితీరు తగ్గడంతో వైద్యులు దాన్ని తొలగించారు. అనంతరం కొంతకాలం డయాలసిస్ చేయించుకున్న ఆండ్రూస్‌కు మానవ దాత నుంచి లభించిన మూత్రపిండాన్ని అమర్చినట్లు పేర్కొన్నారు.

**అవయవాల కొరతకు కొత్త మార్గమా?**

మానవ మూత్రపిండాల కోసం ప్రపంచవ్యాప్తంగా అనేక మంది రోగులు దీర్ఘకాలం వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో జంతువుల అవయవాలను జన్యుమార్పులతో మానవులకు ఉపయోగించే జెనోట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంపై వైద్య పరిశోధనలు కొనసాగుతున్నాయి.పంది మూత్రపిండం మానవ శరీరంలో ఇంతకాలం పనిచేయడం ఈ రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. అయితే ఇది ఇంకా విస్తృత వైద్య వినియోగానికి అందుబాటులోకి రాలేదు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు, భద్రతా పరీక్షల అనంతరం అవయవాల కొరతను తగ్గించడంలో ఈ విధానం ఎంతవరకు ఉపయోగపడుతుందో స్పష్టమవుతుంది.

# శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శుక్రవారం 7వ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాలని, స్థానిక ప్రజలకు, ఆలయ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ రమాదేవి శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భానుక నర్మదా మల్లికార్జున్ స్వగృహంలో సందడిగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**బోయినపల్లి, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ స్వగృహంలో కృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ప్రాంత ప్రజలందరికీ ఆమె శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకృష్ణ భగవానుని కృపతో ప్రజలందరి జీవితాల్లో సంతోషం, శాంతి, ఐశ్వర్యం మరియు దైవిక ఆశీస్సులు కలగాలని ఆమె ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో భాగంగా భానుక నర్మదా మల్లికార్జున్ తమ మనవరాడు సమృద్ధి, మనవడు రుద్రదేవ్‌లను రాధా-కృష్ణుల వేషధారణలో ఎంతో ముచ్చటగా, దివ్యంగా అలంకరించారు. చిన్నారి రాధా-కృష్ణులకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, శ్రీకృష్ణుడు వారికి ఆయురారోగ్యాలు, అంతులేని ఆనందాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# లిటిల్ మైండ్స్ హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

## కృష్ణుడు, రాధా వేషధారణలో చిన్నారుల సందడి




**మహబూబాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ జిల్లా ప్రతినిధి):** డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని లిటిల్ మైండ్స్ హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గోగుల మల్సూర్, కరస్పాండెంట్ మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో ముస్తాబై ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణలు, చిలిపి చేష్టలు, భక్తి భావంతో నిర్వహించిన కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోగుల మల్సూర్, కరస్పాండెంట్ మహేశ్వరి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో పండుగలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, న్యాయం వంటి విలువలను విద్యార్థులు తెలుసుకోవడం ద్వారా మంచి నడవడికను అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు.ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృతిక చైతన్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# పటాన్ చెరువులో అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు









**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04 :** పటాన్ చెరు పట్టణంలోని జెపి కాలనీలో ఉన్న శ్రీ సత్యభామ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గత 4 సంవత్సరాలుగా ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ తదితర ముఖ్య నాయకులు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష పుష్పాలంకరణ మరియు కళ్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఇస్కాన్ బృందం వారి భజనలు, శ్రీ విద్యానికేతన్, యూరో కిడ్స్ స్కూల్ విద్యార్థుల నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. అలాగే భార్గవి, ఐశ్వర్య రెడ్డి, సంధ్య డాన్స్ క్లాస్ విద్యార్థులు ప్రదర్శించిన 'మహాభారత ఘట్టాలు', రాధాకృష్ణుల నృత్య రూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సుమారు 15 వేల మంది భక్తులందరికీ ఘనంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. పటాన్ చెరు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు.? ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెట్టు రమా కుమార్ యాదవ్, మెట్టు ఎల్లేష్ యాదవ్, కుటుంబ సభ్యులు, ఆలయ, అన్నదాన, భజన కమిటీల సభ్యులు మరియు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి కింద 'తులం బంగారం' ఇవ్వాల్సిందే!

**ఎన్నికల హామీలు అమలు చేసే వరకు పోరాటం**

**కాంగ్రెస్ నాయకులను పెళ్లిళ్లకు**

**ఆహ్వానించొద్దంటూ బీఆర్ఎస్ శ్రేణుల తీర్మానం**

**గోదావరిఖని, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** కళ్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం అందించాల్సిందేనని డిమాండ్ చేస్తూ రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు తీర్మానం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వరకు పోరాటాలను కొనసాగిస్తామని ప్రకటించారు.బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మూల విజయారెడ్డి నేతృత్వంలో గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళా సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరై మాట్లాడారు.ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు అమలు చేయలేదని చందర్ విమర్శించారు. 33 నెలలకు ఒక్కో మహిళకు రూ.82,500 ప్రభుత్వం బాకీ పడిందని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్ల పెంపు హామీలను కూడా ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు.రామగుండం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డులో జరిగే ఆడపిల్లల వివాహాలకు కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించడాన్ని నిలిపివేయాలని చందర్ పిలుపునిచ్చారు. కళ్యాణలక్ష్మి పథకం కింద హామీ ఇచ్చిన తులం బంగారం అందించిన తర్వాతే కాంగ్రెస్ నాయకులను వివాహాలకు ఆహ్వానించాలని సూచించారు. ఈ మేరకు సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పాలనలో కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఉపయోగపడ్డాయని చందర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఉచిత స్కూటర్లు, తులం బంగారం, నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, పింఛన్ల పెంపు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.హామీలను వెంటనే అమలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు, పింఛనుదారుల సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని చందర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌశిక్ హరినాథ్, నడిపెల్లి మురళీధర్ రావు, హరీష్ రెడ్డి, మూల విజయారెడ్డి, మహేష్, కర్క పద్మజ, రమేష్, కిషన్ రెడ్డి, నారాయణ, మేకల సమ్మన్న, తస్నిమ్ భాను, అనుముల కళావతి, పర్ష స్వాతి, బోడకుంట వెంకటలక్ష్మి, శాంతిలక్ష్మి, కృష్ణవేణి, రంగు దుర్గాప్రసాద్, కంకల దేవేందర్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నిజాముద్దీన్‌తో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఆరు గ్యారంటీలు గాలికి..420 హామీలు బోగస్

**కాంగ్రెస్ 1000 రోజుల పాలన దగా..**

**నారాయణఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో గుర్రపు మచ్చేందర్ ఆదేశాలతో దద్దరిల్లిన బీఆర్ఎస్ నిరసనలు**

**కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయాం**

**ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన రేవంత్ సర్కార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04 (నారాయణ ఖేడ్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, మోసపూరిత హామీలతో ప్రజలను నిలువునా వంచించిందని పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నారాయణఖేడ్ నియోజకవర్గం కేంద్రంలో జీఎంఆర్ అనుచరులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో గెలవడానికి వృద్ధులకు, వితంతువులకు రూ.4000/- పింఛన్, దివ్యాంగులకు రూ. 6000/- పింఛన్,మహిళలకు నెలకు రూ.2500/- కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటర్లు ఇస్తామని గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో దివ్యాంగులు, వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ పింఛన్లు సకాలంలో అందించేవారమని గుర్తుచేశారు. నేడు సదరం క్యాంపులను సరిగ్గా నిర్వహించట్లేదని, సర్టిఫికెట్లు పొందాలంటే దళారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేనిదే పనులు జరగని పరిస్థితి దాపురించిందన్నారు. అదేవిదంగా నిత్యావసర సరుకుల ధరలు, మందుల రేట్లు విపరీతంగా పెరిగి సామాన్యుడి బతుకు భారంగా మారిందని, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి అద్భుతమైన పథకాలను ప్రభుత్వం అటకెక్కించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట బస్సుల సంఖ్య తగ్గించి వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో నిరంతర కరెంట్, సాగునీరు అందించి వ్యవసాయాన్ని పండుగ చేస్తే.. నేడు కరెంట్ కోతలు, సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు చదువుకునే గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేక,కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను గాలికి వదిలేసి పాలకులు హెలికాప్టర్లలో తిరుగుతూ, అప్పులు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా బడుగు, బలహీన వర్గాల కోసం,ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ గులాబీ జెండా నీడన అండగా ఉండి నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, మాజీ పార్టీ అధ్యకులు, నాయకులు కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.





## ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** జిహెచ్ఎంసీ పరిధిలోని ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రేమ, ఉత్సాహాల నడుమ అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధల ఉరిపించే వేషధారణలతో అందరినీ అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రాజేష్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి బోధనలైన ధర్మ మార్గం, సత్యం, ప్రేమ, కరుణ వంటి ఉత్తమ గుణాలను విద్యార్థులు చిన్నతనం నుంచే జీవితంలో అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పండుగ వేడుకల ద్వారా పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై స్పష్టమైన అవగాహన, గౌరవం పెరుగుతాయని తెలిపారు.ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పాఠశాల సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సినీ హీరోయిన్ హెబ్బా పటేల్ చేతుల మీదుగా 'చెన్నై షాపింగ్ మాల్' గ్రాండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నాణ్యతతో కూడిన వస్త్ర ప్రపంచాన్ని చెన్నై షాపింగ్ మాల్ ప్రజలకు అత్యంత సమీపంలోకి తీసుకువచ్చిందని ప్రముఖ సినీ హీరోయిన్ హెబ్బా పటేల్ కొనియాడారు. రామచంద్రాపురం పట్టణ కేంద్రంలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో చెన్నై షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గ్రాండ్ ఎగ్జిబిషన్ మేళా'ను షాపింగ్ మాల్ డైరెక్టర్ కృష్ణారావుతో కలిసి ఆమె లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా హెబ్బా పటేల్ మాట్లాడుతూ.. ఈ గ్రాండ్ ఎగ్జిబిషన్ పది రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యుత్తమ నాణ్యత, సరికొత్త డిజైన్లతో కూడిన విశేషమైన కలెక్షన్స్ ఈ మేళాలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని గొప్ప షాపింగ్ అనుభూతిని పొందాలని కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చెన్నై షాపింగ్ మాల్ ప్రతినిధులు, నిర్వాహకులు, సిబ్బంది మరియు స్థానిక పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసిన సంచార జాతుల ప్రతినిధి బృందం



**హైదరాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని వారి అధికారిక నివాసంలో రాష్ట్ర సంచార జాతుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేణుక నారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ తిపిరిశెట్టి, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మోహన్ చౌహన్, పిల్లి సంజయ్ కిరణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.రాబోయే "రాష్ట్ర విముక్తి జాతుల దినోత్సవం-2026" వేడుకల నిర్వహణ మరియు సంచార జాతుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రతినిధి బృందం మంత్రికి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. సంచార విముక్తి జాతుల దినోత్సవ వేడుకల నిర్వహణపై వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేణుక నారాయణ సమక్షంలో, సంఘ నాయకులతో కలిసి రాష్ట్ర బీసీ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఎంబీసీ కార్పొరేషన్ సీఈఓలతో చర్చించాలని సూచించారు. ఈ చర్చల అనంతరం కార్యక్రమానికి సంబంధించిన తుది నిర్ణయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. మంత్రి తెలిపిన సానుకూల స్పందనకు సంచార జాతుల సంఘ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న సూరారం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్**

**శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలతో అలరించిన చిన్నారులు**



**సూరారం, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సూరారం డివిజన్‌లో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సూరారం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ పాల్గొని శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరాగా.. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ తదితర పౌరాణిక వేషధారణల్లో హాజరై సందడి చేశారు. పిల్లల సంప్రదాయ దుస్తులు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే కృష్ణాష్టమి వేడుకలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. మన సనాతన సంప్రదాయాలను, సంస్కృతిని చిన్నారులకు చిన్నతనం నుంచే పరిచయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణాష్టమి ఉత్సవాలను విజయవంతం చేశారు.


# సొంత నిధులతో ఫాగింగ్ మిషన్ల పంపిణీ

**నాయకుడు కే. ప్రసాద్ రెడ్డి సేవాతత్పరతపై ప్రజల హర్షం**

**దోమల నివారణకు కోహిర్ మండలంలోని 4 గ్రామాలకు యంత్రాలు అందజేత**



**జహీరాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు కే. ప్రసాద్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. సొంత నిధులతో కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లను వివిధ గ్రామాలకు శుక్రవారం నాడు ఆయన స్వయంగా పర్యటించి అందజేశారు. జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహిర్ మండలంలో ఉన్న సజ్జాపూర్, ఖానాపూర్, కొత్తూర్ (కే), పిచరాగడి తండా గ్రామాల్లో వర్షాకాలం దృష్ట్యా ప్రజలు దోమల బారిన పడి అనారోగ్యానికి గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఫాగింగ్ మిషన్లను పంపిణీ చేశారు. స్థానిక సమస్యపై తక్షణమే స్పందించి సొంత ఖర్చులతో మిషన్లు అందించడంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. కే. ప్రసాద్ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడుతూ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పిచరాగడి తండా సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాథోడ్ వినోద్ కుమార్, ఖానాపూర్ సర్పంచ్ బుర్కా ఆనంద్, కొత్తూరు (కే) సర్పంచ్ పిల్లి నర్సింలు, సజ్జపూర్ సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్‌లు మైసయ్య, మల్లేశం, సంగమేష్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, నర్సింహులు, రాజు, అబ్రహం, దిలీప్, యాదప్ప తదితరులు పాల్గొన్నారు.



# ఇటలీ ప్రధాని మెలోనికి మోదీ అభినందనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 04, హైదరాబాద్ పల్స్ న్యూస్:** ఇటలీ ప్రధానిగా అత్యధిక కాలం నిరంతరాయంగా కొనసాగిన నేతగా అరుదైన ఘనత సాధించిన జార్జియా మెలోనికి భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో మోదీ స్పందిస్తూ.. మెలోని సాధించిన ఈ మైలురాయి ఇటలీ ప్రజలకు ఆమె నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 2022 అక్టోబర్‌లో ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మెలోని.. రాజకీయ అస్థిరతకు పేరున్న ఇటలీలో వరుసగా 1,413 రోజులకు పైగా ప్రధానిగా కొనసాగి, మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోని పేరిట ఉన్న రికార్డును అధిగమించారు. భారత్-ఇటలీ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో మెలోని అందిస్తున్న సహకారాన్ని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఆమె స్నేహం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. భారత్, ఇటలీ ప్రజల ఉజ్వలమైన, సంపన్నమైన భవిష్యత్తు కోసం మెలోనితో కలిసి మరింత సన్నిహితంగా పనిచేయాలని ఎదురుచూస్తున్నట్లు మోదీ తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ 420 హామీల్లో మహిళలకు తీవ్ర అన్యాయం

**హామీల అమలులో విఫలమైందంటూ బీఆర్ఎస్ ఆరోపణ**

**కంటోన్మెంట్‌లో నివేదిత సాయన్న ఆధ్వర్యంలో సమావేశం**

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బీఆర్ఎస్ శాఖ పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు అన్నానగర్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో కంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత సాయన్న ఆధ్వర్యంలో మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాజీ మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, మాజీ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల నాగేష్, మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీధర్ శ్రీనివాస్, కంటోన్మెంట్ మాజీ బోర్డు సభ్యురాలు అనిత ప్రభాకర్, కేబీ శంకర్రావు, కార్ఖానా కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను వెయ్యి రోజుల పాలనలో అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీల అమలులో తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కంటోన్మెంట్ పరిధిలోని పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. పలు భూములతో పాటు కొన్ని అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు సంబంధించిన ఆస్తులు కూడా 22ఏ జాబితాలో ఉన్నాయని తెలిపారు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భూములను 22ఏ జాబితా నుంచి తొలగించకపోతే పెద్ద ఎత్తున



ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# బీసీ మహిళా మంత్రిపై వేటు సరికాదు

**కొండా సురేఖను వెంటనే మంత్రివర్గంలోకి తీసుకోవాలి**

**డోర్నకల్ బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు సాధనాల రాము డిమాండ్**

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 04, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** బీసీ మహిళా నాయకురాలు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని డోర్నకల్ బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు సాధనాల రాము అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ, ప్రభుత్వ స్థాయిలో నెలకొన్న అంతర్గత విభేదాలకు బీసీ మహిళా మంత్రిని బాధ్యురాలిగా చేసి పదవి నుంచి తొలగించడం సమంజసం కాదన్నారు. అగ్ర నాయకుల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాల ప్రభావం బీసీ మహిళా



నాయకురాలిపై పడటం బాధాకరమని పేర్కొన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సింది పోయి కఠిన నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. కొండా సురేఖ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునఃపరిశీలించి, ఆమెను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలోనూ అదే విధానాన్ని చూపాలని అన్నారు. బీసీ మహిళా నాయకురాలిపై తీసుకున్న చర్యలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం మార్చుకోవాలని సాధనాల రాము కోరారు.

# విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సుకు అందరూ ఆహ్వానితులే

**ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి**

**ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు.**

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ఈ నెల 6వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సు'కు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ డి. ఓంప్రకాష్ పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులను కలిసి సదస్సు ఆహ్వాన పత్రికలను అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకే ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని జైత్ర ఆసుపత్రి పైభాగంలో ఉన్న పూలే మార్ట్ (మహిళా ప్రాంగణం) లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ నవోదయ సిద్ధార్థతో పాటు పలువురు ప్రొఫెసర్లు, హైకోర్టు న్యాయవాదులు, విద్యావేత్తలు హాజరై వివిధ అంశాలపై ప్రసంగిస్తారని వివరించారు. విద్యారంగ



సమస్యలపై చర్చించేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖైసర్, ఉపాధ్యాయులు కాశినాథ్, ఏసప్ప, సర్దార్, పాండురంగారెడ్డి, శివరాం నాయక్, సంతోష్, రవి, పండరీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై విమర్శించే అర్హత బిఆర్ఎస్ కు లేదు



**భువనగిరి అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం మీరు సిద్ధమా?**

**మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై, అభివృద్ధిపై బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడడం సరికాదని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మా ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గం, భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తమ ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిందని, పట్టణంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, బస్వాపురం, తిమ్మాపూర్ బాధితులకు సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి పరిహారం ఇప్పించారని తెలిపారు. ఇదే కాకుండా పట్టణంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. భువనగిరి నియోజకవర్గం మరియు మున్సిపల్ అభివృద్ధి, సంక్షేమంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, సమయం, వేదిక మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి నిర్ణయించాలని వారు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, పాలకుర్తి అబ్జర్వర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కుక్కదుగు సోమయ్య సీనియర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు కో ఆప్షన్ మెంబర్లు మైనార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# భువనగిరిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణంలోని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు చూపిన మార్గం, భగవద్గీత బోధనలు నేటి యువతకు, సమాజానికి ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణుని, రాధాదేవి వేషధారణలో చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ఆకట్టుకునే వేషధారణను చూసి భక్తులు, స్థానికులు మురిసిపోయారు. ఈ కార్యక్రమంలోపట్టణ ప్రముఖులు, ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ

## నిందితురాలి అరెస్ట్, నగలు స్వాధీనం

**జహీరాబాద్, సెప్టెంబర్ 04, హైదరాబాద్ పల్స్ న్యూస్:** తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన మహిళను జహీరాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, నిందితురాలి నుంచి చోరీకి గురైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

**ఘటన వివరాలు:**

పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన షకీల్ పాషా (30) అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడు గురువారం పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించిన కర్ణాటకలోని గుల్బర్గా ప్రాంతానికి చెందిన జయశ్రీ (44) అనే మహిళ, తన వెంట తెచ్చుకున్న రాడ్, స్క్రూడ్రైవర్ల సహాయంతో ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించింది.అనంతరం బీరువా తాళాలు పగలగొట్టి



అందులో ఉన్న రెండు మాసాల నల్లపూసల దండ, 20 తులాల వెండి పట్ట గొలుసులు, రెండు వెండి కాళ్ల కడియాలను అపహరించి పరారైంది.

**పోలీసుల వేగవంతమైన దర్యాప్తు:**

ఇంటికి వచ్చిన షకీల్ పాషా చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐడీ పార్టీ సిబ్బందితో కలిసి వేగవంతంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, శుక్రవారం నిందితురాలు జయశ్రీని అదుపులోకి తీసుకున్నారు.ఆమె వద్ద నుంచి చోరీ సొత్తును పూర్తిగా రికవరీ చేసి, నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లవకుమార్ తెలిపారు.

# మాజీ ప్రియుడి పథకం..ప్రియురాలి భర్తపై హత్యాయత్నం

**జహీరాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** పెళ్లైన మహిళతో కొనసాగుతున్న సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఆమె భర్తపై మాజీ ప్రియుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జహీరాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను జహీరాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం..కోహీర్ మండలం బిలాల్‌పూర్‌కు చెందిన వినయ్ కుమార్‌కు రెండేళ్ల క్రితం తోరమామిడికి చెందిన స్వాతితో వివాహమైంది. అయితే స్వాతికి వివాహానికి ముందే కోహీర్ మండలానికి చెందిన నాగరిగారి ప్రవీణ్ కుమార్‌తో ప్రేమ సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం స్వాతికి వినయ్ కుమార్‌తో వివాహం జరిగినప్పటికీ, ప్రవీణ్ కుమార్‌తో మళ్లీ సంబంధం కొనసాగించినట్లు పేర్కొన్నారు.ఈ విషయం వినయ్ కుమార్‌కు తెలియడంతో భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ప్రవీణ్ కుమార్ తరచూ వినయ్‌కు ఫోన్ చేస్తూ, స్వాతి తన వద్దే ఉందంటూ వాయిస్ సందేశాలు, ఫొటోలు పంపి మానసికంగా వేధించినట్లు పోలీసులు తెలిపారు.వినయ్ కుమార్‌ను హత్య చేస్తే తమ సంబంధానికి ఎలాంటి అడ్డంకి ఉండదని భావించిన ప్రవీణ్ కుమార్.. కర్ణాటకలోని బీదర్ జిల్లా లాడ్‌గేరికి చెందిన తన పెద్దమ్మ కుమారుడు ప్రవీణ్ కుమార్ (31) సహాయం కోరాడు. ఇందుకు అతడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.గత నెల 9న సాయంత్రం ఇద్దరూ పథకం ప్రకారం జహీరాబాద్‌లోని చెన్నారెడ్డి కాలనీకి వెళ్లారు. అక్కడ వినయ్ కుమార్‌తో కావాలనే గొడవకు దిగి, 31 ఏళ్ల ప్రవీణ్ కుమార్ వెనుక నుంచి అతడిని పట్టుకున్నాడు. అనంతరం నాగరిగారి ప్రవీణ్ కుమార్ కత్తితో వినయ్ కుమార్ వీపుపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వినయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో కోహీర్



మండలం లాలాకుంటకు చెందిన నాగరిగారి ప్రవీణ్ కుమార్ (28), కర్ణాటక బీదర్ జిల్లా లాడ్‌గేరికి చెందిన ప్రవీణ్ కుమార్ (31) నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను శుక్రవారం జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐ లవకుమార్ వెల్లడించారు.

# తెలంగాణలో ఎల్‌నినో వస్తే కరువేనా?

## తెలంగాణలో 75 ఏళ్ల వాతావరణ గణాంకాల్లో ఆసక్తికర అంశాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, మెయిన్ డెస్క్:**

ఎల్‌నినో ప్రభావం కారణంగా సెప్టెంబర్‌లో తెలంగాణలో వర్షాలు తగ్గి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే ఎల్‌నినో ఏర్పడిన ప్రతిసారీ కరువు తప్పదనే అభిప్రాయం సరైంది కాదని గత 75 ఏళ్ల వాతావరణ గణాంకాలు సూచిస్తున్నాయి.1951 నుంచి 2025 వరకు దేశంలో 17 సార్లు ఎల్‌నినో పరిస్థితులు నమోదయ్యాయి. వీటిలో ఎనిమిది సందర్భాల్లో మాత్రమే దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు తీవ్ర కరువుకు దారితీశాయి. తెలంగాణ ప్రాంతాన్ని పరిశీలిస్తే 17 ఎల్‌నినో సంవత్సరాల్లో ఐదు సందర్భాల్లో మాత్రమే తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి.

**కొన్ని సందర్భాల్లో అధిక వర్షాలు**

ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ కొన్ని సంవత్సరాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. 1953లో సాధారణం కంటే 10.7 శాతం, 1994లో 13.9 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.1951లో ఎల్‌నినో సమయంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు దేశవ్యాప్తంగా వర్షపాతం 13.2 శాతం తగ్గగా, సెప్టెంబర్‌లో 26.6 శాతం లోటు నమోదైంది. 1972లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండి నాలుగు నెలల కాలంలో 22.3 శాతం వర్షపాతం లోటు నమోదైంది.

**దేశానికి ఒకలా.. తెలంగాణకు మరోలా**

ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఒకే విధంగా ఉండదని గత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.1965లో దేశవ్యాప్తంగా 18.6 శాతం వర్షపాతం లోటు నమోదైనప్పటికీ తెలంగాణలో సాధారణం కంటే 1.3 శాతం అధికంగా వర్షాలు కురిశాయి.1994లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనప్పటికీ తెలంగాణలో 16.3 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది.2004లో దేశవ్యాప్తంగా 9.6 శాతం వర్షపాతం లోటు నమోదైతే తెలంగాణలో ఏకంగా 35.7 శాతం లోటు నమోదైంది.ఈ గణాంకాలను బట్టి ఎల్‌నినో ప్రభావం ప్రాంతానికో విధంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, రుతుపవనాల కదలికలు, స్థానిక వాతావరణ పరిస్థితులు వంటి అనేక అంశాలు తెలంగాణలో వర్షపాతాన్ని ప్రభావితం చేయగలవు.అందువల్ల ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తప్పనిసరిగా కరువు వస్తుందని ముందుగానే నిర్ధారించడం సరికాదని వాతావరణ గణాంకాలు సూచిస్తున్నాయి.



# రైతుల జీవితాలతో రేవంత్ సర్కార్ ఆటలు..

# నిషేధిత జాబితాపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

**అధికారుల నిర్ణయాలతో రైతులకు ఇబ్బందులు.. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సమీక్షిస్తాం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** రాష్ట్రంలో భూములను నిషేధిత జాబితాలో చేర్చిన వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెబుతున్న నేపథ్యంలో.. కలెక్టర్లు, అధికారులు నిషేధిత భూముల జాబితాలను ఎలా రూపొందించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి, మంత్రి ఆదేశాల మేరకే అధికారులు జాబితాలను రూపొందించారని, అనంతరం తప్పు జరిగిందని చెప్పడం ద్వారా సమస్య పరిష్కారం కాదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజల భూములకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వ పెద్దలు క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.అధికారుల నిర్ణయాలతో రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించాలని కోరారు. అర్హత కలిగిన భూములను నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించి, స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**అధికారంలోకి వస్తే బాధ్యులపై చర్యలు**

బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే నిషేధిత జాబితాలో భూముల చేర్పుపై సమగ్ర సమీక్ష చేపడతామని హరీశ్‌రావు తెలిపారు. రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే రైతుల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములకు రక్షణ కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**కాంట్రాక్టర్ల అంశంపైనా ప్రభుత్వంపై విమర్శలు**

రాష్ట్రంలో అభివృద్ధి పనుల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసేందుకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాలపై కమీషన్లకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని ఆయన విమర్శించారు. ఇవి రాజకీయ ఆరోపణలేనని పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చెప్పుకోదగిన స్థాయిలో పనులు జరగలేదని



హరీశ్‌రావు విమర్శించారు. రైతులు, కాంట్రాక్టర్లు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములపై సమగ్ర విచారణ చేపట్టి, అర్హత కలిగిన భూములను తక్షణమే విముక్తి చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# సికింద్రాబాద్ ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## స్వామి వారి దర్శనానికై బారులు తీరిన భక్తులు




**సెప్టెంబర్ 04, సికింద్రాబాద్(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సికింద్రాబాద్ ఇస్కాన్ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సికింద్రాబాద్ ఇస్కాన్ ఆలయ అధ్యక్షులు మరియు ఐసీసీ చైర్మన్ డాక్టర్ సర్దేవ్ దాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికీ మంగళ హారతి, దర్శన హారతి, రాజభోగ్ హారతి, వైభవ్ దర్శనం, భజన కీర్తనల కార్యక్రమాలు ఆలయ కమిటీ నిర్వహించారు. మహా అభిషేకం, ఈ వేడుకలకు ప్రముఖులు, రాజకీయ నాయకులు,వ్యాపార వేత్తలు, తదితరులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణమంతా పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేసారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, ఆలయ నిర్వాహకులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



# ఇస్రో ఘన విజయం.. దేశానికి గర్వకారణం: ప్రధాని మోదీ

**హైదారాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, సెంట్రల్ డెస్క్:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో కీలక విజయాన్ని సాధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా భారత తొలి ఇమేజింగ్ ఉపగ్రహం ఈఓఎస్-05ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడాన్ని ఆయన ప్రశంసించారు.ఇస్రో సాధించిన ఈ అద్భుత విజయం యావత్ దేశానికి గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. భారత అంతరిక్ష రంగంలో సాంకేతికత, ఆవిష్కరణలు వేగంగా విస్తరిస్తున్నాయనడానికి ఈ ప్రయోగం నిదర్శనమని అన్నారు. శాస్త్రవేత్తలు, ఇస్రో సిబ్బంది కృషిని అభినందిస్తూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు దేశీయ పరిశ్రమల భాగస్వామ్యం కూడా కీలకంగా మారుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న సహకారం దేశ అంతరిక్ష కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూరుస్తోందన్నారు.అంతరిక్ష రంగంలో భారత్ తన పరిధిని నిరంతరం విస్తరిస్తోందని మోదీ తెలిపారు. తాజా ప్రయోగం భారత అంతరిక్ష సామర్థ్యాలకు మరో ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందని పేర్కొంటూ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు.




# గర్భసంచి ఆపరేషన్‌కు వెళ్తే.. మహిళ కిడ్నీ తొలగింపు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గర్భసంచి ఆపరేషన్ కోసం వెళ్లిన ఓ మహిళను వైద్యుడు నిలువునా మోసం చేశాడు. గర్భసంచి ఆపరేషన్‌తో పాటు ఆమె కిడ్నీని కూడా తొలగించాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో వెలుగు చూసింది.యాదగిరిగుట్టకు చెందిన కమలమ్మ అనే మహిళ గత కొంతకాలంగా గర్భాశయ సమస్యలతో బాధపడుతుంది. ఈ క్రమంలో జులై 13న ఆలేరులోని అర్పిత నర్సింగ్ హోమ్‌ను ఆశ్రయించారు. గర్భాశయంలో కణితి ఉందని, దాన్ని తొలగించాలని వైద్యుడు ప్రభాకర్ చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందుకు రూ. లక్షా 50 వేలు ఖర్చు అవుతుందని చెప్తే.. తాము రూ. లక్షా 30 వేలు చెల్లిస్తామని చెప్పి, ఆ డబ్బు కూడా చెల్లించామని చెప్పారు. దీంతో శస్త్ర చికిత్స నిర్వహించి మూడు బాక్సులు ఇచ్చారు. అందులో కణితులు ఉన్నట్లు చెప్పారు. వీటిని బయాప్సి నిమిత్తం ల్యాబ్‌కు పంపగా, అందులో ఒకటి కిడ్నీ ఉందని తేలింది. కిడ్నీని ఎందుకు తొలగించారనే ల్యాబ్ సిబ్బంది మమ్మల్ని ప్రశ్నించగా, మేం డాక్టర్‌ను నిలదీయగా, పొరపాటున కిడ్నీని తొలగించినట్లు ఒప్పుకున్నాడు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.



# స్కూల్ బస్సులో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

**డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. శనివారం వరకు పోలీసు కస్టడీ**

**ముంబై, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
ముంబైలో మూడేళ్ల చిన్నారిపై స్కూల్ బస్సు డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఘటనకు సంబంధించి 30 ఏళ్ల బస్సు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.లిప్రాథమిక వివరాల ప్రకారం..లి బుధవారం మధ్యాహ్నం కిండర్‌గార్టెన్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఇళ్లకు తరలించేందుకు ప్రైవేట్ స్కూల్ బస్సు బయలుదేరింది. మార్గమధ్యంలో ఇతర విద్యార్థులు దిగిపోయిన తర్వాత మూడేళ్ల చిన్నారి మాత్రమే బస్సులో మిగిలింది. ఈ సమయంలో డ్రైవర్ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇంటికి చేరుకున్న అనంతరం చిన్నారి కడుపునొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపింది. అలాగే బస్సులో డ్రైవర్ తనను ఇబ్బంది పెట్టాడని చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.గురువారం నిందితుడిని స్థానిక న్యాయస్థానంలో హాజరుపరచగా, శనివారం వరకు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి వాంగ్మూలం, వైద్య పరీక్షల నివేదిక, బస్సులో జరిగిన పరిణామాలపై దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన బీర్ల అనిత

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రంగారెడ్డి, జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి పురాతన ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బీర్ల అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న బీర్ల అనిత కి ఆలయ అర్చకులు, నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వేణుగోపాల స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారికి పుష్పాలు, పండ్లు సమర్పించి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి జన్మాష్టమి వేడుకల్లో పాల్గొని, శ్రీకృష్ణుని బాల్య లీలలను స్మరించుకున్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి.శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతి, సంతోషం, ఐశ్వర్యం నింపాలని బీర్ల అనిత ఆకాంక్షించారు.

# ఉప్పలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్న బైరి విశ్వనాథం గౌడ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని తన సొంత వ్యవసాయ భూమిలో ఉప్పలమ్మ దేవాలయాన్ని సందర్శించిన సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్–విజయలక్ష్మి కుటుంబ సమేతంగా ఉప్పలమ్మ తల్లి పండుగలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మొరుగాడి నరసమ్మ, బైరి ఎల్లమ్మ, బైరి మౌనిక–సంపత్ కుమార్ గౌడ్, బైరి నిహారిక – విష్ణు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# అక్టోబర్ 7న చలో అమరావతి ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేద్దాం

**అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం..**

**యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం బొమ్మలరామారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల స్థాయి సమావేశం మండల ఇంచార్జీ మైలారం జంగయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబర్ 7 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి లో జరుగబోయే జాతీయ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.అసమానతలు లేని సమాజ నిర్మాణకై ముందుకు నడువాలని అన్నారు.విశిష్ట అతిథిగా హాజరైన ఎంఎస్పీ మాజీ జిల్లా నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ.. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు సామాజిక, ఆర్థిక అసమానతల పై భవిష్యత్ ఉద్యమం జరుగుతుంది అని సమాజం లో అందరిని కలిపి ఉద్యమాలకు సిద్ధం చేయాలని అన్నారు.అనంతరం ఎంఆర్పిఎస్, ఎంఎస్పీ, ఎమ్మెసేఫ్ మండల కమిటి, పట్టణ కమిటీ ఎన్నిక జరిగింది.నూతన బొమ్మలరామారం ఎమ్మార్పియస్ మండల కమిటీ అధ్యక్షులుగా కత్తి సాయి ప్రసాద్ మాదిగ , అధికార ప్రతినిధిగా బాణాల నగేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పొట్ట





మహేందర్ మాదిగ, ఉపాధ్యక్షులు గా ఉద్దేమర్రి నరేందర్ మాదిగ, కార్యదర్శిగా బాసారం ప్రవీన్ మాదిగ ఎంఎస్పీ బొమ్మలరామారం మండల కమిటీ అధ్యక్షులు గా మైలారం ఈశ్వర్ మాదిగ,అధికార ప్రతినిధిగా ఊట్ల నర్సింహ్మా మాదిగ,మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులుగా మైలారం దినేష్ మాదిగ లు మాదిగ ఉద్యోగ సమాఖ్య అధ్యక్షులు గా ఎర్రోళ్ల జహంగీర్ మాదిగ జిల్లా కమిటీకి జంగయ్య మాదిగ, రామస్వామి మాదిగ, రామకృష్ణ మాదిగ, ఊట్ల రమేష్ మాదిగ తదితరులు ఎన్నికయ్యారు.

# ఒవైసీ సోదరులపై రాజాసింగ్ విమర్శలు

**రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం.. రాజకీయ చరిత్ర తెలుసుకోవాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 04 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
సైదాబాద్ ఉక్కు వంతెన ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒవైసీ సోదరులను ప్రశంసించడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఒవైసీలను దేశభక్తులుగా పేర్కొనే ముందు వారి రాజకీయ చరిత్రను పరిశీలించాలని ముఖ్యమంత్రికి సూచించారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో అసదుద్దీన్ ఒవైసీ భారత్‌కు మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను రాజాసింగ్ ప్రస్తావించారు. ఒవైసీ సోదరుల దేశభక్తిపై ముఖ్యమంత్రికి అంత నమ్మకం ఉంటే ప్రారంభోత్సవ కార్యక్రమంలో జాతీయ గీతాలు, దేశభక్తి నినాదాలతో వారి వైఖరిని స్పష్టం చేయాల్సిందని వ్యాఖ్యానించారు.

**'15 నిమిషాల' వ్యాఖ్యలను గుర్తుచేసిన రాజాసింగ్**
గతంలో అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన '15 నిమిషాల' వ్యాఖ్యలను రాజాసింగ్ ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యల



నేపథ్యంలోనే ఒవైసీ సోదరుల రాజకీయ వైఖరిపై ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. వారి వల్లే హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

**పాతబస్తీ అభివృద్ధిపైనా ప్రశ్నలు**
పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించడంపైనా రాజాసింగ్ ప్రశ్నలు సంధించారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి వచ్చిన నిధులను ఏ ప్రాంత అభివృద్ధికి ఎంత మేర ఖర్చు చేస్తున్నారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.గతంలో పాతబస్తీ నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, పన్నుల వసూళ్లపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. ప్రస్తుతం అదే ప్రాంతంలో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కిరణ్‌కుమార్‌రెడ్డి విధానాన్ని అనుసరించాలి**
గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి ఒవైసీ సోదరుల విషయంలో అనుసరించిన వైఖరిని రేవంత్‌రెడ్డి పాటించాలని రాజాసింగ్ సూచించారు.గతంలో కేసీఆర్ ఒవైసీ కుటుంబంతో సన్నిహితంగా వ్యవహరించారని విమర్శించిన రాజాసింగ్.. రేవంత్‌రెడ్డి కూడా అదే విధానాన్ని అనుసరిస్తే రాజకీయంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒవైసీ సోదరుల విషయంలో ముఖ్యమంత్రి తన వైఖరిని పునఃపరిశీలించాలని కోరారు.

# 1000 రోజుల ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం-అభివృద్ధికి పెద్దపీట

**కేటీఆర్ ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు**

**తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**


**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూనే ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు.తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుండటాన్ని సహించలేక కల్వకుంట్ల కుటుంబం, బీజేపీ నాయకులు ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తూ కాళ్లలో కట్టెలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. అధికారం కోల్పోయిన అసహనంతో ఉన్న కల్వకుంట్ల కుటుంబం ప్రజలను తప్పుదోవ పట్టించడమే ధ్యేయంగా రాజకీయాలు చేస్తోందని అన్నారు. మార్చి నుంచి పాదయాత్ర చేస్తానని కేటీఆర్ నల్గొండలో ప్రకటించారని, కేటీఆర్ పాదయాత్ర చేసి ఆరోగ్యం కాపాడుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఆయన పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.బీఆర్ఎస్‌లో హరీష్ రావు ప్రభావం పెరుగుతుండటంతో కేటీఆర్‌లో ఆందోళన మొదలైందని, పార్టీలో హరీష్ రావు పెత్తనం పెరిగిపోతుండటంతో తన రాజకీయ భవిష్యత్తుపై కేటీఆర్ భయపడుతున్నారని బీర్ల ఐలయ్య అన్నారు. తనను పార్టీ నుంచి హరీష్ రావు బయటకు పంపారని, భవిష్యత్‌లో కేటీఆర్‌ను కూడా బయటకు పంపి పార్టీని తన చేతుల్లోకి తీసుకుంటాడని కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. బావ వెన్నుపోటు పొడుస్తాడన్న భయంతోనే కేటీఆర్ పాదయాత్రకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని విమర్శించారు. పాదయాత్ర చేస్తే పార్టీలో తన ఇమేజ్ పెరిగి తనను నాయకుడిగా గుర్తిస్తారని కేటీఆర్ భావిస్తున్నారని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేసినా, మోకాళ్ల యాత్ర చేసినా, చివరకు పొర్లు దండాల యాత్ర చేసినా ఫలితం మాత్రం శూన్యమేనని ఎద్దేవా చేశారు. సరుకు లేని నాయకులు ఎన్ని యాత్రలు చేసినా ప్రజల్లో ఆదరణ లభించదని అన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పార్టీ ఖాతాలో భారీగా నిధులు ఉన్నాయని, ఆ డబ్బుతో భాజా భజంత్రీలు పెట్టుకుని, పెయిడ్ పింక్ ఆర్టిస్టులతో పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని, కానీ ప్రజలను మాత్రం నమ్మించలేరని బీర్ల ఐలయ్య అన్నారు. కేసీఆర్ బస్సు యాత్ర చేస్తారని కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, ముందుగా మీ అయ్య కేసీఆర్‌ను అసెంబ్లీ సమావేశాలకు రమ్మని చెప్పాలని సూచించారు. ప్రతిపక్ష నేతగా జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి కూడా ఆసక్తి చూపడం లేదని, అసెంబ్లీకి రావడానికి చేతకాని కేసీఆర్ బస్సు యాత్ర చేస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.రైతుల గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బీర్ల ఐలయ్య అన్నారు. రైతు అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే రైతు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అందిస్తూ ఇప్పటి వరకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. 32 నెలల లెక్కల ప్రకారం వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేశామని, రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఈ గణాంకాలతోనే స్పష్టమవుతుందని అన్నారు.వరి సాగు, ఉత్పత్తిలో తెలంగాణ పంజాబ్‌ను అధిగమించి దేశంలో నంబర్--1గా నిలిచిందని బీర్ల ఐలయ్య తెలిపారు. గత యాసంగి సీజన్‌లో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 13.37 లక్షల మంది రైతులకు రూ.18,929 కోట్లు చెల్లించామని చెప్పారు. గత రెండు సీజన్లలో 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.35,077 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్ని కార్యక్రమాలు చేపడుతుంటే తామే అన్నీ చేశామని కేటీఆర్ చెప్పడం సిగ్గుచేటని




విమర్శించారు.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ముందుగానే స్పష్టం చేశారని బీర్ల ఐలయ్య అన్నారు. వర్షపాతం తక్కువగా ఉండటంతో ఈసారి ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో నిండలేదని, ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందని అన్నారు. అయితే కేటీఆర్ నీళ్లపై కూడా రాజకీయాలు మొదలు పెట్టారని, సాగర్ ఎడమకాల్వకు నీళ్లు విడుదల చేయాలని రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.నీటి లభ్యత, ప్రాజెక్టుల పరిస్థితి, భవిష్యత్ అవసరాలను అంచనా వేసి ఎప్పుడు, ఎలా నీటిని విడుదల చేయాలో ప్రభుత్వానికి పూర్తిగా తెలుసని బీర్ల ఐలయ్య అన్నారు. ప్రస్తుతం ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే రైతులకు సూచించిందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి తగిన వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండితే తప్పకుండా సాగునీటిని విడుదల చేస్తామని స్పష్టం చేశారు. రైతులు పంటలు వేసుకుని నీళ్లు లేక పంటలు ఎండిపోయి నష్టపోతే, ఆ పరిస్థితిని రాజకీయంగా ఉపయోగించుకోవాలన్నదే కేటీఆర్ ఆలోచనగా కనిపిస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సహకరించాలని, రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడకూడదని అన్నారు.రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని అప్రమత్తంగా ఉండాలని, కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాలు, నీచ రాజకీయాలను తిప్పికొట్టాలని బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులు, పేదలు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగుతోందని, ప్రజల ఆశీస్సులతో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

# జ్ఞాన జ్యోతులు వెలిగించే గురువులకు వందనం

## జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం - సెప్టెంబర్ 5 ప్రత్యేక వ్యాసం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, తెలంగాణ బ్యూరో:** "గురువు" అనే పదానికి భారతీయ సంస్కృతిలో ఎంతో ఉన్నతమైన స్థానం ఉంది. సమాజ నిర్మాణానికి మూలస్తంభాలుగా నిలుస్తూ, అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి విజ్ఞాన జ్యోతులను వెలిగించేవారు ఉపాధ్యాయులు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వం, దేశభక్తి వంటి జీవన విలువలను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అపారమైనది. భారతదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటాం. ఈ రోజు భారతదేశపు ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు, భారత రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి. తన పుట్టినరోజును వ్యక్తిగత వేడుకగా కాకుండా దేశంలోని ఉపాధ్యాయుల గౌరవార్థం జరుపుకోవాలని ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయం ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆయనకున్న గౌరవాన్ని తెలియజేస్తుంది.

**డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ - బాల్యం మరియు విద్యాభ్యాసం:**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న తిరుత్తణిలో జన్మించారు. ఆయన కుటుంబం సంప్రదాయ విలువలకు ప్రాధాన్యతనిచ్చే కుటుంబం. ఆయన తండ్రి సర్వేపల్లి వీరస్వామి, తల్లి సీతమ్మ. పూర్వీకుల స్వస్థలం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు ప్రాంతంలోని సర్వేపల్లి. చిన్ననాటి నుంచే రాధాకృష్ణన్ విద్య పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు. తిరుపతి, వెల్లూరులో ప్రాథమిక విద్యాభ్యాసం కొనసాగించిన ఆయన అనంతరం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో తత్వశాస్త్రాన్ని అభ్యసించారు. తత్వశాస్త్రంపై ఆయనకు ఉన్న లోతైన ఆసక్తి తరువాత ఆయనను ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్తగా నిలబెట్టింది.

**ఉపాధ్యాయుడిగా రాధాకృష్ణన్ ప్రస్థానం:**

1909లో రాధాకృష్ణన్ తన బోధనా వృత్తిని ప్రారంభించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ, మైసూరు విశ్వవిద్యాలయం, కలకత్తా విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో తత్వశాస్త్రాన్ని బోధించారు. బోధనా శైలి, విశాలమైన జ్ఞానం, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తూర్పు మతాలు, నైతికతకు సంబంధించిన అధ్యాపక పదవిని చేపట్టారు. భారతీయ తత్వశాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఆయన రచనలు, ఉపన్యాసాలు కీలక పాత్ర పోషించాయి.

**విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో కీలక పాత్ర:**

రాధాకృష్ణన్ కేవలం తరగతి గదికే పరిమితమైన ఉపాధ్యాయుడు కాదు. ఉన్నత విద్యా రంగ అభివృద్ధికి కూడా ఆయన విశేషంగా కృషి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మరియు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలకు వైస్ ఛాన్సలర్‌గా సేవలందించారు. విద్య అనేది కేవలం ఉద్యోగం పొందడానికి ఉపయోగపడే సాధనం కాదని, వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ నిర్మాణానికి పునాది అని ఆయన భావించారు.

**విద్యావేత్త నుంచి రాజనీతిజ్ఞుడిగా:**

స్వాతంత్ర్యానంతరం రాధాకృష్ణన్ ప్రజా జీవితంలోకి ప్రవేశించారు. యునెస్కోలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు సోవియట్ యూనియన్‌లో భారత రాయబారిగా కూడా సేవలందించారు.

1952లో భారతదేశపు తొలి ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. వరుసగా రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా సేవలందించారు.

1962లో భారతదేశ రెండవ రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించి 1967 వరకు ఆ పదవిలో కొనసాగారు.

ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తి దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదగడం ఆయన ప్రతిభకు, విద్యా విలువలకు గొప్ప నిదర్శనం.

భారతరత్నతో గౌరవం:

రాధాకృష్ణన్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1954లో భారతరత్న పురస్కారంతో సత్కరించింది. భారతరత్న ప్రారంభమైన తొలి సంవత్సరంలోనే ఆయనకు ఈ అత్యున్నత పౌర పురస్కారం లభించడం ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విశిష్టతకు నిదర్శనం. తత్వశాస్త్రం, మతం, నైతికత, విద్య వంటి అంశాలపై ఆయన అనేక గ్రంథాలు రచించారు. భారతీయ తత్వచింతనను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఆయన రచనలకు ప్రత్యేక స్థానం ఉంది.

భారతీయ సంస్కృతిలో గురువు స్థానం:

భారతీయ సంప్రదాయంలో గురువుకు అత్యంత గౌరవప్రదమైన స్థానం ఉంది.

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః"

అనే శ్లోకం గురువు యొక్క గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుంది.

గురువు విద్యార్థికి అక్షరజ్ఞానం అందించడంతో పాటు జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తాడు. తప్పును సరిదిద్దుతాడు, ప్రతిభను గుర్తిస్తాడు, నిరాశలో ధైర్యాన్ని ఇస్తాడు, విజయానికి మార్గం చూపిస్తాడు. భారతీయ సమాజంలో గురువును కేవలం బోధకుడిగా కాకుండా మార్గదర్శకుడిగా, ఆదర్శంగా, జ్ఞానదాతగా భావిస్తారు.

ఆధునిక సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర:

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో విద్యార్థులకు సమాచారం అందించడం మాత్రమే ఉపాధ్యాయుడి పని కాదు.

**నైతిక విలువల పెంపకం:**

నిజాయితీ, క్రమశిక్షణ, దయ, సహనం, బాధ్యత, సమానత్వం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం.

ఆలోచనా శక్తి పెంపకం:

విద్యార్థులు కేవలం పాఠాలను కంఠస్థం చేయకుండా ప్రశ్నించడం, విశ్లేషించడం, కారణాలను అన్వేషించడం, సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం నేర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

సాంకేతిక యుగంలో మార్గదర్శకత్వం:

ఇంటర్నెట్, సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం నేటి ఉపాధ్యాయుల ముఖ్య బాధ్యతగా మారింది.

విద్యార్థుల ప్రతిభను గుర్తించడం:

ప్రతి విద్యార్థి ఒకే విధంగా నేర్చుకోడు. వారి ఆసక్తులు, సామర్థ్యాలు, సృజనాత్మకతను గుర్తించి తగిన మార్గదర్శకత్వం అందించాలి.

సమాజ బాధ్యతను పెంపొందించడం:

పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, లింగ సమానత్వం, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య బాధ్యత వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచడం ద్వారా ఉపాధ్యాయులు బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేస్తారు.

ఎన్ఈపి 2020లో ఉపాధ్యాయుల ప్రాధాన్యత:

జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపి 2020) విద్యను మరింత సమగ్రంగా, నైపుణ్య ఆధారితంగా, విద్యార్థి కేంద్రితంగా మార్చడానికి ప్రాధాన్యతనిస్తుంది.

బట్టీ పద్ధతికి బదులుగా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, అనుభవాత్మక అభ్యాసం వంటి అంశాలకు ప్రాధాన్యత పెరుగుతోంది.

ప్రాథమిక స్థాయిలో పిల్లలకు అర్థమయ్యే భాషలో, ముఖ్యంగా మాతృభాష లేదా ప్రాంతీయ భాషలో బోధనకు కూడా ప్రాధాన్యత ఇవ్వబడింది.

మార్పులను తరగతి గదిలో విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం.

డిజిటల్ యుగంలో మారుతున్న గురువు పాత్ర:

ఒకప్పుడు ఉపాధ్యాయుడే విద్యార్థికి ప్రధాన జ్ఞాన వనరు. ఇప్పుడు విద్యార్థి చేతిలోనే స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, డిజిటల్ లైబ్రరీలు, ఏఐ వంటి అనేక వనరులు ఉన్నాయి.

సమాచారం అందుబాటులో ఉండటం మాత్రమే విద్య కాదు.

ఏది నిజం?
ఏది అపోహ?
ఏ సమాచారాన్ని నమ్మాలి?

సాంకేతికతను ఎలా బాధ్యతగా ఉపయోగించాలి?
సమాజానికి ఉపయోగపడే విధంగా జ్ఞానాన్ని ఎలా వినియోగించాలి?
విషయాలను నేర్పించడంలో ఉపాధ్యాయుడి మార్గదర్శకత్వం మరింత ముఖ్యమవుతోంది.

అందువల్ల ఏఐ గురువును భర్తీ చేయడం కంటే, గురువు బోధనా విధానాన్ని మార్చే సాధనంగా మారుతోంది అని చెప్పవచ్చు.

ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం, వారి వృత్తి ప్రాధాన్యతను ప్రపంచానికి తెలియజేయడం.

విద్యార్థుల జీవితంలో గురువు స్థానం:

ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితాన్ని మార్చగలడు.
ఒక మాటతో నిరాశ చెందిన విద్యార్థిలో ఆశను నింపగలడు.
ఒక ప్రోత్సాహంతో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయగలడు.
ఒక సూచనతో జీవిత లక్ష్యాన్ని చూపగలడు.
ఒక మంచి విలువతో సమాజానికి ఉపయోగపడే పౌరుడిని తయారు చేయగలడు. గురువు ప్రభావం తరగతి గది గోడలతో ముగియదు. అది విద్యార్థి జీవితాంతం కొనసాగుతుంది.

గురువులకు మన కృతజ్ఞత:

ఉపాధ్యాయ దినోత్సవం కేవలం పూలు, బహుమతులు, శుభాకాంక్షలకు పరిమితమైన రోజు కాదు.

మన జీవితంలో మనకు అక్షరాలు నేర్పిన గురువులను, మనలోని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులను, తప్పు చేసినప్పుడు సరిదిద్దిన గురువులను, మన విజయాన్ని చూసి మనకంటే ఎక్కువగా ఆనందించిన గురువులను స్మరించుకునే రోజు. "గురువును గౌరవించడం అంటే జ్ఞానాన్ని గౌరవించడం; జ్ఞానాన్ని గౌరవించడం అంటే సమాజ భవిష్యత్తును గౌరవించడం."

**ముగింపు**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది-విద్య ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక సమాజాన్ని, ఒక దేశాన్ని మార్చగల శక్తి. ఉపాధ్యాయుడిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం భారత రాష్ట్రపతి స్థాయికి చేరుకుంది. తన పుట్టినరోజును దేశంలోని ఉపాధ్యాయుల గౌరవార్థం అంకితం చేయడం ద్వారా ఆయన గురువు వృత్తి గొప్పతనాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. నేడు సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకాలు ఎంతగా మారినా, బోధనా పద్ధతులు ఎన్ని మార్పులు చెందినా విద్యార్థి జీవితాన్ని అర్థం చేసుకుని సరైన దిశలో నడిపించే గురువు అవసరం ఎప్పటికీ ఉంటుంది. ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నిస్వార్థంగా కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి మనస్ఫూర్తిగా వందనం చేద్దాం.

"గురువు వెలిగించిన జ్ఞాన జ్యోతి... తరతరాలకు వెలుగునిస్తుంది."

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు!

దేశ భవిష్యత్తును నిర్మించే ప్రతి గురువుకూ శతకోటి వందనాలు.

వ్యాసకర్త
**వేల్పుల మహేందర్,**
**ఎంఎస్సి, ఎంఎ, ఎం.ఇడి**
**అధ్యాపకులు,**
**అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత,**
**9912775834.**



**2026 విఎంఆర్। అల్ రైట్ రిజర్వడ్ కంటెంట్ పూర్తిగా స్వయంగా రూపొందించి, రచించినది.**
**నా అనుమతి లేకుండా ఈ కంటెంట్‌ను కాపీ చేయడం, ఇతర పేరుతో ప్రచురించడం చేయరాదు.**
**అనుమతి లేకుండా కాపీ చేయవద్దు.**

# యాదాద్రి జిల్లా లేబర్ సెల్ కన్వీనర్‌గా జంపాల శ్రీనివాస్ నియామకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు, బీజేపీ లేబర్ సెల్ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్‌గా జంపాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందె శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జంపాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో లేబర్ సెల్ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ లేబర్ సెల్‌ను జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీజేపీ జనరల్ సెక్రటరీ వేముల అశోక్, పాశం భాస్కర్, జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్, లకు జంపాల శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనను ఆదరించి, ఆశీర్వదించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, అభిమానులను మనస్ఫూర్తిగా కోరుతున్నానని జంపాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ఆలేరులో విద్యార్థి-యువజన ర్యాలీని విజయవంతం చేయాలి

## రాజపేట మండల యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 5న ఉదయం 9 గంటలకు ఆలేరులోనీ పాల సెంటర్ నుండి ఆలేరు బస్టాండ్ వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీ విజయవంతం చేయాలని రాజపేట మండల యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ పిలుపునిచ్చారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని . కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను విస్మరిస్తోందని విమర్శిస్తూ, సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.

# రేణికుంటలో విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి ప్రఖండ రేణికుంట గ్రామంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి మరియు విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండ సురేష్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం, ధర్మం మానవునికి ఉన్న రెండు కళ్ళ లాంటివి వాటిని రెంటిని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని, విశిష్ట అతిథిగా విచ్చేసిన దుశెట్టి బాలకిషన్ సమాజంలో మన హిందువుల పైన జరుగుతున్న అన్యాయాలు ఎదుర్కోవలసిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి బూరుగు సంతోష్ రెడ్డి, రాజపేట మండల కార్యదర్శి ఇమ్మడి ఓం ప్రకాష్, ఆడెపు బాలకృష్ణ, మాచర్ల మల్లేష్, ఎర్ర విజయ, ఐరేని శ్రీధర్, పబ్బోజు శ్రీధర్, ఆడెపు వెంకటయ్య, అవధూత బాబు, అర్చకులు రేగొండ పాండురంగం, అర్చకులు తిరుక్కొవల్లూరి పాండురంగ స్వామి, మాచర్ల రాణి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి ప్రఖండ రేణికుంట గ్రామంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి మరియు విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండ సురేష్ మాట్లాడుతూ... దేశం, ధర్మం మానవునికి ఉన్న రెండు కళ్ళ లాంటివి వాటిని రెంటిని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన దుశెట్టి బాలకిషన్ మాట్లాడుతూ, సమాజంలో మన హిందువుల పైన జరుగుతున్న అన్యాయాలు ఎదుర్కోవలసిన బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి విద్యార్థులు శ్రీ కృష్ణ గోపిక రాధ అలంకరణలో పాల్గొనటం జరిగింది. విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి బూరుగు సంతోష్ రెడ్డి, రాజపేట మండల కార్యదర్శి ఇమ్మడి ఓం ప్రకాష్, ఆడెపు బాలకృష్ణ, మాచర్ల మల్లేష్, ఎర్ర విజయ, ఐరేని శ్రీధర్, పబ్బోజు శ్రీధర్, ఆడెపు వెంకటయ్య, అవధూత బాబు, అర్చకులు రేగొండ పాండురంగం, తిరుక్కొల్లూరి పాండురంగ స్వామి, మాచర్ల రాణి తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

## వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 04, తెలంగాణ బ్యూరో :** హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోంద్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డిబిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.